సాక్షి
నంద్యాల
బుధవారం । 31 । జనవరి । 2024



పార్వేట పల్లకీకి పూజలు

రుద్రవరం: బ్రహ్మోత్సవాలకు భక్తజనాన్ని ఆహ్వా నించేందుకు పల్లకీలో బయలుదేరిన అహోబిలే శుడు మంగళవారం నల్లవాగుపల్లె తెలుపులపై కొలువుదీరి పూజలందుకున్నారు.



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయప్రాంగణంలోని శనగల బసవన్నకు, బయలు వీరభద్ర స్వామికి మంగళవారం అర్చకులు విశేషపూజలు నిర్వహించి ప్రత్యేక నైవేద్యం సమర్పించారు.



ప్రయత్నం.. స'ఫలం'

ఓ రైతు పట్టుదలతో సమస్యలను అధిగమించి సిరుల పంట పండించాడు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడి సాధించి పలువురు రైతులకు ఆదర్శంగా నిలిచాడు. 8లో..

న్యూస్‌రీల్

పంచాయతీలకు రూ.27 కోట్లు మంజూరు



రికార్డులను పరిశీలిస్తున్న డీపీఓ మంజులవాణి

శిరివెళ్ల: 2022–23 ఆర్థిక సంవత్సరానికి 15వ ఆర్థిక సంఘం రెండవ విడత కింద గ్రామ పంచాయతీలకు రూ. 27 కోట్లు మంజూరయ్యాయని డీపీఓ మంజుల వాణి తెలిపారు. మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. నీటి, ఇంటి పన్నుల రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పంచాయతీలకు మంజూరైన నిధులను విద్యుత్ బిల్లులు, పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు, ఇతర పనులకు వినియోగించుకోవాలన్నారు. ఫిబ్రవరి నెలలో మళ్లీ విడత మంజూరవుతాయన్నారు. అలాగే జిల్లాలో 2023– 24 ఆర్థిక సంవత్సరానికి రూ. 7.8 కోట్ల ఇంటి పన్ను వసూలు లక్ష్యం కాగా ఇంత వరకు రూ. 1.7 కోట్లు వసూళ్లు అయ్యాయన్నారు. ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేయడం మొదలైందని, 10 రోజుల్లోగా ప్రక్రియ పూర్తవుతుందన్నారు. ఆమె వెంట ఈఓ ఆర్డీ నాగేంద్ర ఉన్నారు.

రైల్వే మహిళా ఉద్యోగులకు భద్రత



బ్యారక్ రూంను ప్రారంభిస్తున్న ఐజీ ఠాకూర్ అరోమా

డోన్ రూరల్: రైల్వే స్టేషన్‌లో విధులు నిర్వహించే మహిళా ఉద్యోగులకు పటిష్టమైన భద్రత కల్పిస్తున్నామని ఆర్‌పీఎఫ్ ఐజీ ఠాకూర్ అరోమా అన్నారు. డోన్ రైల్వే స్టేషన్‌లో మహిళా ఉద్యోగుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ప్రత్యేక బ్యారక్‌ను మంగళవారం ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైలు ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆపద, అత్యవసర సమయాల్లో రైల్వే శాఖ సూచించిన టోల్‌ఫ్రీ నంబర్లకు సమాచారం అందించాలన్నారు. అనంతరం బ్యారక్ రూం ఆవరణలో మొక్కలు నాటారు.

వైఎస్‌ఆర్ పెన్షన్ కానుకకు రూ.141.02 కోట్లు

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్‌ఆర్ పెన్షన్ కానుక కింద ఫిబ్రవరి నెల పింఛన్ల పంపిణీకి ఉమ్మడి కర్నూలు జిల్లాకు రూ.141.02 కోట్లు విడుదలయ్యాయి. బుధవారం వార్డు, గ్రామ సచివాలయ సెక్రటరీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు సంబంధిత బ్యాంకుల నుంచి వైఎస్‌ఆర్ పెన్షన్ కానుక నిధులను డ్రా చేయనున్నారు. 1వ తేదీ ఉదయం 5 గంటల నుంచి పింఛన్ల పంపిణీ మొదలవుతుంది. కర్నూలు జిల్లాలో 2,48,231 పింఛన్లకు రూ.74,33,50,000, నంద్యాల జిల్లాలో 2,24,395 పింఛన్లకు రూ.66,69,29,500 విడుదలైనట్లు డీఆర్‌డీఏ పీడీ సలీమ్‌బాషా తెలిపారు.

బదిలీలకు 88 మంది దరఖాస్తు

కర్నూలు(అగ్రికల్చర్): పశుసంవర్ధక శాఖ క్లస్టర్లలో పనిచేస్తున్న ఏహెచ్‌ఏ బదిలీల ప్రక్రియను ఈ నెల 31న చేపట్టనున్నారు. ఉమ్మడి జిల్లా లో 130 మంది ఏహెచ్‌ఏలు పనిచేస్తుండగా 88 మంది బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. కర్నూలు జిల్లాలో 42 మంది, నంద్యాల జిల్లాలో 46 మంది ఉన్నారు. జిల్లా స్థాయిలో ఏహెచ్‌ఏల బదిలీలకు జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ రామచంద్రయ్య చేపడుతారు. అంతర్ జిల్లా బదిలీలను డైరెక్టర్ చేస్తారు.

కందులు క్వింటా రూ.10,699

కర్నూలు(అగ్రికల్చర్):కర్నూలు మార్కెట్‌కు ఉమ్మడి కర్నూలు జిల్లాతో పాటు అనంతపురం జిల్లా నుంచి కూడా కందులు విక్రయానికి వస్తున్నాయి. మంగళవారం క్వింటా ధర గరిష్టంగా రూ.10,699 పలికింది. మోడల్ ధర రూ.10,169 లభించిందంటే అ త్యధిక లాట్లకు మంచి ధరలే లభించినట్లు తెలుస్తోంది.

నాడు ఆర్భాటాలు

గత టీడీపీ ప్రభుత్వం పేదల ఇళ్ల విషయంలో ఆర్భాటాలు చేస్తూ మోసం చేసింది. టిడ్కో ప్లాట్లలో భారీ దోపిడీకి పాల్పడిన టీడీపీ ప్రభుత్వం 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఎన్నికల కోడ్ వస్తుందన్న ఆందోళనలో హడావిడిగా ఇళ్ల నిర్మాణాలు మొదలు పెట్టినట్లు హంగామా చేసింది. 10 శాతం పనులు పూర్తి చేయకుండానే లబ్ధిదారులకు కేటాయిస్తున్నట్లు ఆర్భాటం చేయడంతో లబ్ధిదారులు విస్తుపోయారు. సౌకర్యాలు లేని చోట ఉండలేక అద్దె ఇళ్లకే పరిమితమయ్యారు. సొంతింటి కోసం అప్పులు చేసి రూ. లక్ష, రూ. 50 వేలు చొప్పున డిపాజిట్లు చెల్లించిన లబ్ధిదారులు అటు ప్లాట్లు దక్కక, ఇటు వడ్డీల భారంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

నేడు ఆధునిక వసతులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టిడ్కో లబ్ధిదారులకు న్యాయం జరిగింది. నేడు రూపాయికే రూ. 10 లక్షల ఆస్తి సొంతం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఏ – కేటగిరి కింద ఒక్కో ఇంటిని రూ 6.55 లక్షల వ్యవయంతో నిర్మిస్తోంది. ఆ మొత్తంలో కేంద్ర ప్రభుత్వం రూ 1.50 లక్షలు ఇస్తోంది. మిగతా రూ 5.05 లక్షలను రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోంది. దీనికి తోడు మంచినీరు, అంతర్గత రహదారులు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, విద్యుత్ సౌకర్యం, స్థలం విలువ తదితర ఖర్చులు లెక్కిస్తే ఒక్క ప్లాట్ విలువ సుమారు రూ. 10 లక్షల వరకు అవుతుంది. అయితే లబ్ధిదారుడికి మాత్రం కేవలం ఒక్క రూపాయికే అందజేయడంతో పాటు రిజిస్ట్రేషన్ ఖర్చు రూ. 50 వేలు కూడా ప్రభుత్వమే భరిస్తోంది.



ఆళ్లగడ్డలో అన్ని హంగులు సంతరించుకున్న జగనన్న టిడ్కో ఇళ్ల సముదాయం, (ఇన్‌సెట్‌లో) రహదారి పక్కన చిరు దుకాణాలు నిర్వహించుకుంటున్న స్థానికులు

అదిగో చూడు పేదల పట్టణం

- జగనన్న నగర్‌లో సౌకర్యాల జీవనం
- నెరవేరిన పేదల దశాబ్దాల కల
- సౌకర్యాలు కల్పించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- నాడు టీడీపీ ప్రభుత్వం టిడ్కో షో
- నేడు రూపాయికే రూ. 10 లక్షల ఆస్తి సొంతం చేసిన వైనం
- ఒక్కో ఇంటిపై రిజిస్ట్రేషన్ ఖర్చు రూ. 50 వేలు భరించిన ప్రభుత్వం

టవర్లు : 29	ఒక్కో టవర్‌లోని ఇళ్లు : 48
	నివాస గృహాలు : 1,392

నిధుల కేటాయింపు ఇలా..

రహదారులు..: రూ. 40 కోట్లు	
మంచినీటి సదుపాయానికి..: రూ 21.6 కోట్లు	
విద్యుత్ సౌకర్యం: రూ 11.5 కోట్లు	
పార్కులు, ఇతర వసతులు..: రూ 23.3 కోట్లు	

ఆళ్లగడ్డ: నవరత్నాల్లోని అందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఆళ్లగడ్డ పట్టణ పేదలు గృహ ప్రవేశం చేసి సౌకర్యాల మధ్య జీవనాన్ని కొనసాగిస్తున్నారు. నాడు గుడిసెల్లో, అద్దె ఇళ్లలో మగ్గిపోయిన నిరుపేదలు నేడు విశాలమైన ఇంటిలో పిల్లాపాలతో ఆనందంగా గడుపుతున్నారు. ఆళ్లగడ్డ పట్టణ శివారులోని నంద్యాల, కడప హైవే రోడ్డ పక్కన 21 ఎకరాల్లో 'జగనన్న నగర్'లో 1,392 టిడ్కో గృహాలను నిర్మించారు. ఒక్కో బ్లాక్‌లో 48 గృహాల చొప్పున 29 బ్లాక్‌ల్లో నిర్మించి నిరుపేదలకు కేటాయించారు. దీంతో ఇక్కడ సుమారు 5 వేల జనాభా నివాసముండటంతో పాటు వివిధ రకాల వ్యాపార సముదాయాలు కూడా వెలసడంతో పట్టణ శివారలో మరో నవనగరం ఏర్పడినట్లు అయింది. పేదల ఇళ్లు కదా అని సౌకర్యాలు, వసతులకు ఖర్చు చేయడంలో ఏమాత్రం రాజీ పడలేదు. ఇళ్లలో పూర్తిగా మేలు రకం టైల్స్‌తో ఫ్లోరింగ్ వేశారు. బెడ్ రూం, లివింగ్ రూం, ఆకట్టుకు నేలా రూపొందించారు. గ్రానైట్ ఫ్లాట్ ఫాంతో కూడిన వంట గది, సింక్‌లు చక్కగా ఉన్నాయి. కిటికీలు, తలపులు నాణ్యతో కూడుకున్నవి వినియోగించారు. ఆధునిక వసతులతో కూడిన వెస్ట్రన్ టాయిలెట్ కూడా ఏర్పాటు చేశారు. 40 అడుగుల వెడల్పుతో కూడిన అంతర్గత రోడ్ల నిర్మాణం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సౌకర్యం ఏర్పాటు చేశారు. ప్రతి టవర్‌కు ఇళ్ల మధ్యన కోటియార్డ్ ఏర్పాటు చేయడం జరిగింది.ప్రతి బ్లాక్‌కు 20 అడుగుల ఖాళీ స్థలాన్ని వదిలి నిర్మించడంతో ఆహ్లాదకర వాతవరణం నెలకొంది. చిన్నారుల కోసం ఆటస్థలాలు, పార్కులను ఏర్పాటు చేయడానికి ప్రత్యేకంగా స్థలాన్ని కేటాయించారు.



అధునాతన మినరల్ వాటర్ ప్లాంట్



రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మొట్టమొదటి సారి 10 లక్షల లీటర్ల సామర్థ్యంతో అధునాతన 1 ఎంఎల్‌డీ మైక్రో ఫిల్టర్ (మినరల్ వాటర్ ప్లాంట్)ను ఏర్పాటు చేశారు. ఆర్వో ప్లాంట్ నుంచి నేరుగా ఇళ్లకు శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయడం జరుగుతోంది. టిడ్కో గృహాలకు కేవలం 5 లక్షల లీటర్లు సరిపోతాయి. అయితే ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సూచన మేరకు చుట్టు పక్కల కాలనీ వాళ్లు వచ్చి నీళ్లు పట్టుకున్నా సరిపోయేలా ముందు జాగ్రత్తగా 10 లక్షల లీటర్ల సామర్థ్యంతో ఏర్పాటు చేశారు. దీనికి అనుసంధానంగా 30 లక్షల లీటర్ల ఓవర్ హెడ్ ట్యాంకు, మరో 10 లక్షల సామర్థ్యంతో అండర్ గ్రౌండ్ ట్యాంకును ఏర్పాటు చేశారు. ఒక్కో టవర్‌పై ఆ టవర్‌లో నివాసమున్న 16 ఇళ్లకు 6 వేల లీటర్ల సామర్థ్యంతో ఉన్న ఒక ట్యాంకును ఏర్పాటు చేసి నిరంతరం నీటి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకున్నారు.

నిరంతరం విద్యుత్



ఒక్కో సముదాయం ఎదుట 200 కే వీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఇంట్లో విద్యుత్ వాడకం తెలిసేలా ప్రత్యేక మీటర్లను అదే బ్లాక్‌లోని మెట్ల దిగువన బిగించారు. విద్యుత్ తీగలు భవంతులకు తగలకుండా సుదూరంలో అమర్చారు. రోడ్లకు ఇరువైపుల ఎల్‌ఈడీ వీధిలైట్లు ఏర్పాటు చేయడంతో రాత్రి సమయంలో పున్నమి వెన్నెలా వెలుగొందుతోంది

మురుగునీటి శుద్ధి కేంద్రం



ఇళ్లలోని వ్యర్థాలు, వాడకపు నీరు వేర్వేరు పైపుల గుండా మురుగు కాల్వల్లోకి చేరేలా పైపులైన్లు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా మురుగును నీటి శుద్ధి ప్లాంట్‌కు తరలించి శుద్ధి అనంతరం బయటకు వదులుతారు. ప్రధాన మురుగు కాల్వల్లో చెత్తాచెదారం అడ్డుపడకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజీలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

అంతర్గత రహదారులు



ఇళ్ల సముదాయం మధ్య 40 అడుగుల వెడల్పున సిమెంట్ రోడ్లు నిర్మించారు. వర్షం నీరు రహదారులపై నిల్వకుండా రోడ్లకు ఇరువైపుల పెద్ద డ్రైన్‌లు ఏర్పాటు చేశారు. రోడ్లు, డ్రైయిన్‌ను ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించారు.

పేదల కళ్లలో ఆనందం

సకల సౌకర్యాలు, వసతులు ఉన్న నివాస గృహంలో పేదలు ఉండాలన్నది సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశయం. ఈ మేరకు టిడ్కో గృహాల వసతులు, సౌకర్యాలు పనుల నాణ్యతలో ఎక్కడా రాజీ పడకుండా సకల సదుపాయాలతో నిర్మాణాలు పూర్తి చేశాం. లబ్ధిదారుడు సంతృప్తిగా విల్లాలో నివాసం ఉన్నామనే విధంగా ఏర్పాట్లు కల్పించాం. లబ్ధిదారులు అన్ని వసతులు, సౌకర్యాలు, ఇంటిలో అమర్చిన పరికరాల నాణ్యత పరిశీలించుకుని సంతృప్తి వ్యక్తం చేసిన తరువాతనే ఇంటి తాళం అందజేస్తున్నాం. ఏవైన చిన్న చిన్న మైనర్ పనులు పెండింగ్ ఉన్నాయని తెలిపితే వెంటనే వాటిని పూర్తి చేసేందుకు ఇప్పటికీ ఇంజినీర్లు, సిబ్బందిని అందుబాటులో ఉంచాం. చూడచక్కని టిడ్కో ఇళ్లలో నివాసం ఉన్న పేదల కళ్లలో ఆనందం చూస్తుంటే మాకు కూడా ఎంతో సంతృప్తిగా ఉంది.



– రాజశేఖర్ – టిడ్కో ఎస్ఈ

భూ సంరక్షణపై దృష్టి సారించాలి

గోస్పాడు: భూ సంరక్షణపై ప్రతి రైతు దృష్టి సారించాలని బనగానపల్లె కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు ధనలక్ష్మీ, బాలరాజు అన్నారు. జిల్లెల్ల గ్రామంలో ప్రకృతి వ్యవసాయం కింద సాగుచేసున్న రైతు బాలమద్దిలేటి పొలంలో మట్టి పరీక్ష నమూనాలను మంగళవారం సేకరించారు. అనంతరం వారు మాట్లాడతూ ప్రకృతి వ్యవసాయ విధానం వల్ల రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతు పొలాల్లో మట్టి నమూనాలను సేకరించి పరీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. భూమిలో కర్బన శాతం, సూక్ష్మ పోషకాలు, మేలుజాతి పోషక విలువలు ఎంత మాత్రం ఉన్నాయో తెలుసుకునేందుకు వీలవుతుందన్నారు. దీంతో పాటు రసాయనిక మందులు వాడిన పొలాల్లో కూడా మట్టి పరీక్షలు చేసి రెండింటిలో ఉన్న వ్యత్యాసాన్ని రైతులకు వివరిస్తామన్నారు.

ఏపీ టూరిజం రెస్టారెంట్లకు టెండర్ల ఆహ్వానం

కర్నూలు కల్చరల్: జిల్లాలోని పర్యాటక శాఖ హోటల్స్, రెస్టారెంట్లను లీజుకు ఇచ్చేందుకు టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటక సాంస్కృతిక శాఖ అధికారిణి విజయ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ టూరిజం అథారిటీ వారి సుంకేసుల డ్యామ్ వద్ద నిర్మాణ దశలో నిలిచిపోయిన ఏపీ టూరిజం రెస్టారెంట్, ఓర్వకల్ మండలం కేతవరం గ్రామం వద్ద ఉన్న ఏపీ టూరిజం రెస్టారెంట్, ఆదోని మండలం ఉరుకుందలోని శ్రీ ఉరుకుంద ఈరన్న స్వామి గుడి వద్ద నిర్మాణ దశలో నిలిచిపోయిన ఏపీ టూరిజం రెస్టారెంట్‌లను 20 సంవత్సరాలకు లీజుకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. టెండర్ దరఖాస్తులను ఫిబ్రవరి 1 నుంచి 5వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు కలెక్టరేట్‌లోని ఏపీ టూరిజం అథారిటీ కార్యాలయంలో పొందవచ్చన్నారు. వివరాలకు 63099 42034, 82477 04152ను సంప్రదించాలన్నారు.

అవగాహనతోనే కుష్టు వ్యాధి నివారణ

నంద్యాల టౌన్: అవగాహనతోనే కుష్టు వ్యాధి నివారించవచ్చునని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ ఎం. శారదాబాయి అన్నారు. మంగళవారం జాతీయ కుష్టు వ్యాధి నివారణ దినం సందర్భంగా ఆసుపత్రిలోని కాన్ఫరెన్స్ హాల్‌లో వైద్య సిబ్బందికి కుష్టు వ్యాధిపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శారద బాయి మాట్లాడుతూ కుష్టు వ్యాధి నివారణలో భాగంగా జిల్లాలో పక్షోత్సవాలు నిర్వహిస్తున్నామని, ఫిబ్రవరి 13వ తేదీ వరకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సచివాలయం పరిధిలో వైద్య సిబ్బందితో ప్రజలకు ఈ వ్యాధిపై విస్తృతంగా అవగాహన కల్పిస్తామన్నారు. సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రసాదరావు మాట్లాడుతూ 'వివక్షను నిర్మూలిద్దాం గౌరవాన్ని స్వాగతిద్దాం' అనే నినాదంతో ఈ వ్యాధిపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం గాంధీజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ జఫ్రుల్లా, ఆర్‌ఎంఓ శిరీష, డీఎస్‌ఎంఓ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న డాక్టర్ శాంతబాయి, డీసీహెచ్‌ఎస్ జఫ్రుల్లా, వైద్య సిబ్బంది


క్రీడల్లో రాణిస్తే ప్రపంచ స్థాయి గుర్తింపు





సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రోజా, చిత్రంలో శాప్ చైర్మన్ బైరెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, గంగుల ప్రభాకర్‌రెడ్డి, హాజరైన ప్రజలు, క్రీడాకారులు

- క్రీడాంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు ఆడుదాం ఆంధ్ర' పోటీలు
- జగనన్న పాలనలో అందరికీ మేలు
- మంత్రి రోజా, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి



ఇండోర్ స్టేడియం ప్రారంభంలో టెన్నిస్ ఆడుతున్న మంత్రి, ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ: క్రీడల్లో రాణిస్తే ప్రపంచ స్థాయిలో గుర్తింపు లభిస్తుందని రాష్ట్ర పర్యాటక, క్రీడలు, యువజన శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. పట్టణంలోని వైపీపీఎం ప్రభుత్వ కళాశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన ఇండోర్ స్టేడియం ప్రారంభోత్సవం మంగళవారం అట్టహాసంగా జరిగింది. ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, జలవనరుల శాఖ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి రోజా, రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి హాజరై స్టేడియాన్ని ప్రారంభించి క్రీడాకారులకు అంకితం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి రోజా మాట్లాడుతూ క్రీడా రంగంలో ఆంధ్రప్రదేశ్ ముందుండాలన్నదే సీఎం జగనన్న లక్ష్యమన్నారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్రా పోటీలను నిర్వహిస్తుందన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో సంక్రాంతికి వచ్చే డూడూ బసవన్నల్లా ప్రతిపక్షాల నాయకులు ఇంటింటికీ వస్తారని, వారి మాటలు నమ్మి మోసపోకండని సూచించారు. గత చంద్రబాబు పాలనకు ప్రస్తుతం జగనన్న పాలనకు తేడా గమనించాలన్నారు. గతంలో ఏ చిన్న పనికావాలన్నా ఆ గ్రామ నాయకుడి ఇంటి చుట్టూ చెప్పులరిగేలా తిరిగే వారని, ఇప్పుడు ఇంటి దగ్గరకే సంక్షేమం పథకాలు చేరుతున్నాయన్నారు. గుంపులుగుంపులుగా వచ్చే ప్రతిపక్షాలను తరిమి కొట్టాలన్నారు. శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ మంచి ఎవరు చేశారో ఆలోచించుకుని వచ్చే ఎన్నికల్లో ఓటు వేయాలని ప్రజలకు సూచించారు. చంద్రబాబు నోరు తెరిస్తే అబద్ధాలేనని, ఒక్క నిజం కూడా మాట్లాడరని విమర్శించారు. రాష్ట్రంలో ఆడుదాం ఆంధ్రా పోటీలకు రూ. 120 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర జలవనరుల సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం తెచ్చిన నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చి గ్రామంలోనే సమస్యలన్నీ పరిష్కరించుకునే అవకాశం కల్పించారన్నారు. అలాగే రాష్ట్రంలో ఒకే సారి 1.30 లక్షల మందికి ఉద్యోగ అవకాశం కల్పించిన ఘనత సీఎంకే దక్కిందన్నారు. అనంతరం ఆడుదాం ఆంధ్రా పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు.

జగనన్న మాకు దేవుడు..

గత ఎన్నికల్లో జగనన్న గెలవడంతో మా కుటుంబం కష్టాలు గట్టెక్కి సంతోషంగా జీవిస్తోంది. మాకు జగన్ దేవుడుగా కనిపిస్తున్నాడు. నాకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నాడు. పిల్లలు చిన్నగా ఉన్నప్పుడే నా భర్త మరణించాడు. పిల్లల చదువులు, పోషణ ఎలా అని భయపడుతూ కొన్నాళ్లు బతికా. గత ఎన్నికల ముందు జగనన్న హామీలు ఇస్తుంటే వాటిలో చాలా వాటికి నేను అర్హురాలిని అవుతానని, జగనన్న గెలవాలని కలలు గన్నాను. నేను అనుకున్నట్లే జగనన్న ప్రభుత్వం రావడం, పథకాలు అమలు చేయడంతో ఎంతో లబ్ధి పొందాను. ఇప్పటి వరకు వైఎస్సార్ రైతు భరోసా ద్వారా రూ.75వేలు, అమ్మ ఒడి ద్వారా రూ.54 వేలు, నా కూతరు కల్యాణికి జగనన్న విద్యాదీవెన, వసతి దీవెనలతో రూ.60 వేలు, వైఎస్సార్ పింఛన్ కానుక ద్వారా రూ.1.50 లక్షలు లబ్ధి పొందాను. అలాగే నా కొడుకు ట్యాబ్ ద్వారా రూ.13 వేలు, ముఖ్యంగా నా కొడుకు వెంకీ ప్రమాదవశాత్తు కింద పడటంతో చెయ్యి విరిగితే ఆరోగ్యశ్రీ ద్వారా రూ.57 వేలు మంజూరు కావడంతో ప్రైవేటు ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేశారు. నా కుటుంబానికి మొత్తం ఏడు ప్రభుత్వ పథకాలతో ఇప్పటి వరకు రూ.4.09 లక్షలు లబ్ధి పొందాను. నా పెద్ద బిడ్డ కళ్యాణికి వివాహం చేశాను. రెండో కూతురు పూర్ణరేఖ ప్రస్తుతం బీఎస్సీ చదువుతోంది. విద్యా, వసతి దీవెనల పథకాలకు ఎంపికైంది. ఒకే కుటుంబానికి ఇన్నీ సంక్షేమ పథకాలు ఇచ్చిన జగనన్న మా కుటుంబానికి దేవుడు. – గడ్డం దేవి, క్రిష్టిపాడు, దొర్నిపాడు మండలం



రెకమండేషన్ లేకుండానే పింఛన్ వచ్చింది

నా వయస్సు 64 ఏళ్లు. పేదలకు మేలు చేసే ఇలాంటి ప్రభుత్వాన్ని గతంలో ఎప్పుడూ చూడలేదు. అధికారులు, రాజకీయ నాయకుల రెకమండేషన్ అవసరమే లేదు. రేషన్ కార్డుపై ఇంటిలో ఒకరికి పింఛన్ ఇస్తుండటంతో గతంలో నా భార్య దరఖాస్తు చేసుకోగా వృద్ధాప్య పింఛన్ వచ్చింది. కొన్నాళ్ల క్రితం ఆమె అనారోగ్యంతో మృతి చెందింది. ఇటీవల మా వలంటీర్ వచ్చి నాకు వృద్ధాప్య పింఛన్ కోసం అప్లై చేశారు. నేను అర్హుడనని గుర్తించి ప్రభుత్వం పింఛన్ మంజూరు చేసింది. ఇప్పుడు రూ. 3 వేలు పింఛన్ అందుతోంది. గతంలో చాలా మంది మా ఊరోళ్లు టీడీపీ నాయకుల చుట్టూ తిరిగినా ఊరికి ఒకటో, రెండో వచ్చేవి. ఇప్పుడు అర్హత ఉంటే చాలు సంక్షేమ పథకాలకు ఎంపిక చేస్తున్నారు. పతి నెలా ఒకటవ తేదీన ఇంటి వద్దకు వచ్చి పింఛన్ డబ్బులు చేతిలో పెడుతున్నారు. ముసలోళ్లకు ఇంతకన్నా ఇంకేమి కావాలి.



– వెంగళరెడ్డి, పాములపాడు

క్లుప్తంగా

రిలీవ్ అయిన 40 మంది ఎంపీడీఓలు

కర్నూలు(అర్బన్): రాష్ట్ర శాసనసభ సాధారణ ఎన్నికల్లో భాగంగా ఇతర జిల్లాలకు బదిలీ అయిన 42 మంది ఎంపీడీఓల్లో 40 మందిని రిలీవ్ చేసినట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాలకు అనుగుణంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 42 మంది ఎంపీడీఓలను ఇతర జిల్లాలకు బదిలీ చేస్తూ పీఆర్అండ్ఆర్‌డీ కమిషనరేట్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఇందులో కర్నూలు ఎంపీడీఓ ఆజాంఖాన్ ఈ నెల 27న ఆకస్మికంగా మృతి చెందారన్నారు. అలాగే నంద్యాల ఇన్‌చార్జి డీపీఓగా విధులు నిర్వహిస్తున్న మంజులావాణిని మినహాయించి మిగిలిన వారం దరూ బదిలీ అయిన జిల్లాలకు వెళ్లి రిపోర్టు చేసుకునేందుకు వీలుగా రిలీవ్ చేశామన్నారు. ఇందులో 33 మంది ఉమ్మడి అనంతపురం, ఏడుగురు ఉమ్మడి వైఎస్సార్ జిల్లాకు బదిలీ అయ్యారన్నారు. వీరి స్థానంలో అనంతపురం జిల్లా నుంచి 23 మందిని, వైఎస్సార్ జిల్లా నుంచి 16 మంది ఎంపీడీఓలు ఉమ్మడి కర్నూలు జిల్లాకు రానున్నారని తెలిపారు.

మహిళ ప్రాణాలు కాపాడిన వలంటీర్

శ్రీశైలంప్రాజెక్ట్: కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకుంటున్న ఓ మహిళను వలంటీరు కాపాడిన సంఘటన సున్నిపెంటలో చోటు చేసుకుంది. స్థానిక మటన్‌మార్కెట్ సమీపంలో నివసిస్తున్న తలారి సావిత్రి(43) సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. అదే సమయంలో ఆ వీధిలో కులగణన సర్వే జరుగుతుండగా గ్రామ వలంటీర్ జబీవుల్లా సావిత్రి ఇంటికి వెళ్లాడు. అప్పటికే ఆమె ఉరికి వేలాడుతూ కనిపించడంతో పక్కన ఉన్న వారి సహాయంతో కిందకు దించి శ్రీశైలం ప్రాజెక్ట్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకున్నట్లు వైద్యులు తెలిపారు. ఓ నిండు ప్రాణాన్ని కాపాడిన వలంటీర్ జబీవుల్లాను గ్రామ ప్రజలు అభినందించారు.

నేడు డీఈఓ పదవీ విరమణ

కర్నూలు కల్చరల్: జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ వి.రంగారెడ్డి బుధవారం పదవీ విరమణ పొందనున్నారు. 2021 సెప్టెంబర్ 20వ తేదీన ఆయన జిల్లా డీఈఓగా బాధ్యతలు స్వీకరించారు. తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లాకు చెందిన ఈయన ఏపీపీఎస్సీ ద్వారా నిర్వహించిన ఉపాధ్యాయ నియామకాల్లో మొదట కర్నూలు జిల్లాలోని ఎమ్మిగనూరు హైస్కూలులో స్కూల్ అసిస్టెంట్‌గా విధుల్లో చేరారు. ఆ తర్వాత పదోన్నతి పొంది డైట్ కళాశాల అధ్యాపకుడిగా పనిచేశారు. అనంతరం రాయచోటి డిప్యూటీ ఈఓగా పనిచేస్తూ డీఈవోగా పదోన్నతి పొంది కర్నూలు జిల్లాకు వచ్చారు. కాగా ఆయన పదవీ విరమణ సభ బుధవారం సాయంత్రం 5 గంటల కు నంద్యాల చెక్‌పోస్ట్‌లోని మెగాసిరిఫంక్షన్ హాల్ లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

దీర్ఘకాలిక సెలవుల్లో ఎస్‌డీసీ మల్లికార్జునుడు ?

కర్నూలు(సెంట్రల్): హంద్రీనీవా సుజల స్రవంతి యూనిట్–4 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న కె.మల్లికార్జునుడు ఫిబ్రవరి 1 నుంచి దీర్ఘకాలిక సెలవుల్లో వెళ్లనున్నట్లు తెలుస్తోంది. ఆయన ప్రస్తుతం ఆలూరు నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్‌గా ఉన్నారు. అయితే, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల బదిలీల నేపథ్యంలో ఆయన సెలవుపై వెళ్తుండడంతో ఎన్నికల కమిషన్ అనుమతి ఇస్తుందా.. లేదా? అనే విషయాన్ని చూడాల్సి ఉంటుంది. అనుమతి లభించి సెలవుల్లో వెళితే శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ పీఏ గా ఉన్న అనురాధను ఆ స్థానంలో వచ్చే అవకాశం ఉంది.

ప్రయత్నం..సఫలం!

- దానిమ్మ పంట సాగులో రాణిస్తున్న రైతు శ్రీరాములు
- ఉద్యాన శాస్త్రవేత్తలు తొలగించాలన్న పంట నుంచే రాబడి
- ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో బ్యాక్టీరియా బ్లైట్స్‌కు చెక్
- ఆరు ఎకరాల్లో 72 టన్నుల వరకు దిగుబడి
- టన్ను సగటున రూ.1.10 లక్షలకు అమ్మకం

ప్రతికూల పరిస్థితులకు భయపడలేదు. పట్టుదలతో ముందడుగు వేశాడు. శాస్త్రవేత్తలు తొలగించాలని చెప్పిన దానిమ్మ పంట నుంచే సిరులు పండించాడు. సంకల్పం గొప్పదైతే ఎలాంటి సమస్యనైనా అధిగమించవచ్చునని నిరూపించాడు గొల్ల శ్రీరాములు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో ఉద్యాన పంటల సాగులో రాణిస్తూ ఎందరికో ఆదర్శంగా నిలిచారు.



పండిన దానిమ్మ పండ్లను చూపెడుతున్న రైతు శ్రీరాములు



ఎగుమతి చేసేందుకు పండ్లను ప్యాకింగ్ చేస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): గూడూరుకు చెందిన శ్రీరాములు అనేక రకాల పండ్ల మొక్కలతో విస్తారమైన వ్యవసాయ క్షేత్రాన్ని అభివృద్ధి చేసుకున్నారు. ఈ వ్యవసాయ క్షేత్రంలో 6 ఎకరాల్లోని దానిమ్మకు ప్రత్యేకత ఉంది. 2017, 2018 ప్రాంతంలో ఆరు ఎకరాల్లో బగువ రకం దానిమ్మ సాగు చేశారు. మొత్తం 1800 మొక్కలు ఉన్నాయి. ఎలాంటి పురుగుమందులు, రసాయన ఎరువులు వాడకుండా 100 శాతం ప్రకృతి వ్యవసాయమే చేస్తారు. దానిమ్మ నుంచి రెండు పంటలు తీసిన తర్వాత నల్లమచ్చలు వచ్చి చెట్లు దెబ్బ తినడం మొదలైంది. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఫలితం లేకపోవడంతో ఉద్యాన శాస్త్రవేత్తలను పిలిపించుకున్నారు. దానిమ్మ తోటను పరిశీలించిన మీదట ఇది బ్యాక్టీరియా బ్లైట్స్. అత్యంత ప్రమాదకరమైంది. దానిమ్మ మొక్కలను వెంటనే తీసివేయాలని సూచించారు. అయితే.. కంటికి రెప్పలా చూసుకుంటూ వచ్చిన ఆ మొక్కలను ఆయన తొలగించలేదు

ప్రకృతి వ్యవసాయంతో రక్షణ...

దానిమ్మ మొక్కలను కొద్ది రోజులు ఎండలకు బాగ ఎండనిచ్చారు. తర్వాత ఆవుమూత్రం, ఆవు పేడతో ద్రవ జీవామృతం తయారు చేసి వారానికి ఒక్కసారి ఒక్కో మొక్క మొదలు వద్ద 4 లీటర్ల ప్రకారం పోస్తూ వచ్చారు. డ్రిప్ ద్వారా ట్రికోడెర్మావిరిడి, మజ్జిగ, పాలు, గ్రుడ్ల మొక్కలకు ఇస్తూ వచ్చారు. వేప కషాయాలను పిచికారీ చేస్తూ వచ్చారు. ఏడాది పాటు దానిమ్మ మొక్కలను కాపాడుకునేందుకు నిరంతరం శ్రమించారు. ఎట్టకేలకు శ్రమ ఫలించింది. బ్యాక్టీరియ బ్లైట్స్ క్రమంగా తగ్గుముఖం పట్టి పూత విరబూసింది.

రికార్డు స్థాయిలో 72 టన్నుల దిగుబడి....

తీసేయాలన్న దానిమ్మ నుంచి రైతు శ్రీరాములు రికార్డు స్థాయిలో దిగుబడి సాధించాడు. ఎకరాకు 12 టన్నుల ప్రకారం ఆరు ఎకరాల్లో 72 టన్నుల దిగుబడి సాధించాడు. దానిమ్మలో నాణ్యత మెండుగా ఉండటంతో వ్యాపారులు కొనుగోలుకు పోటీ పడ్డారు. పశ్చిమ బెంగాల్, హైదరాబాద్ నుంచి కూడా వ్యాపారులు వచ్చారు. 10 రోజులుగా దానిమ్మలో కోతలు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు 40 టన్నుల వరకు దిగుబడి వచ్చింది. ఇంకా 30 టన్నులకు పైగా దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఎకరాకు 12 టన్నులకుపైగా దిగుబడి వస్తోంది. నాణ్యతకు పెట్టింది పేరుగా ఉండటంతో సాగటున టన్నుకు రూ.1.10 లక్షల వరకు ధర లభించింది. మొత్తంగా దానిమ్మపై రూ.80 లక్షల ఆదాయం పొందడం విశేషం. శ్రీరాములు పండించిన దానిమ్మ కోల్‌కత నుంచి విదేశాలకు ఎగుమతి అవుతున్నట్లు సమాచారం.

ఆరు ఎకరాలకు నైలాన్ క్లాత్‌తో పైకప్పు...

దానిమ్మ కాయల్లో నాణ్యతను పెంపొదించుకునేందుకు ఆరు ఎకరాల్లోని 1800 చెట్లను నైలాన్ క్లాత్‌తో కప్పేశారు. ఇందుకోసం దాదాపు రూ.3 లక్షలు ఖర్చు చేశారు. నైలాన్ క్లాత్‌తో కప్పడం ద్వారా కాయలపై చెమ్మ(తేమ) రాలేదు. కాయలపై చెమ్మ వచ్చి దానిపై ఎండపడితే నల్ల మచ్చలు వస్తాయి. అలాంటి పండ్లకు మార్కెట్‌లో ఎలాంటి డిమాండ్ ఉండదు కనుక నైలాన్ క్లాత్‌తో రక్షణ ఏర్పాటు చేశారు. ఇలా నాణ్యతను పెంపొందించుకోవడానికి ఎన్ని జాగ్రత్తలు అవసరమో అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. కాయ పండుగా మారే దశలో నాణ్యత పెరగడానికి, ఆకర్షణీయమైన కలర్ రావడానికి డ్రిప్ ద్వారా పాలు, మజ్జిగ ఇస్తూ వచ్చారు.



నైలాన్ క్లాత్‌తో దానిమ్మ చెట్లను కప్పేసిన దృశ్యం

“ పంటను కాపాడుకోవడం సంతోషంగా ఉంది

శాస్త్రవేత్తలు దానిమ్మ తోటను పరిశీలించి బ్యాక్టీరియా బ్లైట్స్ తీవ్రత ఎక్కువగా ఉంది. కంట్రోల్ కాదు.. తీసేయాలని చెప్పారు. పంటను తొలగించడానికి మనసొప్పలేదు. ఏదో విధంగా కాపాడుకోవాలని నిర్ణయించుకున్నాను. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను మరింత పకడ్బందీగా అమలు చేశాను. దీంతో దానిమ్మ కోలుకొని కాపునకు వచ్చింది. ఎక్కడా లేని విధంగా రూ.3లక్షలు ఖర్చు చేసి 1800 చెట్లను నైలాన్ క్లాత్‌తో కప్పేశాము. దీని ప్రభావం వల్ల మొక్కలపై చెమ్మ రాలేదు. పండుఈగ బెడద తప్పింది. రికార్డు స్థాయిలో 72 టన్నుల దిగుబడి వచ్చింది. టన్ను దానిమ్మను గరిష్టంగా రూ.1.30 లక్షల వరకు విక్రయించాము. దానిమ్మ నుంచి రూ.80 లక్షలు ఆదాయం పొందుతుండటం ఎంతో సంతోషంగా ఉంది.

– జి.శ్రీరాములు, దానిమ్మ రైతు, గూడూరు

ఏసీబీ వలలో వీఆర్వో



పటుబడిన వీఆర్వో, తలారితో ఏసీబీ అధికారులు

గోనెగండ్ల: మండల పరిధిలోని హెచ్. కైరవాడి గ్రామ సచివాలయంలో మంగళవారం సాయంత్రం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. రైతుల నుంచి హెచ్. కైరవాడి గ్రామ వీఆర్వో రామకృష్ణ, మల్లేష్ (తలారి దాసన్న కుమారుడు) లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ వెంకటాద్రి తెలిపిన వివరాల మేరకు.. హెచ్. కైరవాడికి చెందిన నల్ల బోతుల రంగస్వామి, బోయ హనుమంతు, బోయ శివశర్మ, బోయ విష్ణు, బోయ మహేష్ ఐదుగురు అన్న దమ్ములు. వీరికి గ్రామంలో 239/2, 240–5, 242లో 9.45 ఎకరాల భూమి ఉంది. అమ్మ పేరు మీద ఉన్న ఈ భూమిని వారు విడిభాగాలు చేసుకొని ఆన్‌లైన్, పాస్‌బుక్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకు ఒక్కొక్కరు రూ.3వేలు ఇవ్వాలని వీఆర్వో రామకృష్ణ, మల్లేష్ డిమాండ్ చేశారు. అంత డబ్బు ఇవ్వలేమని ఒక్కొక్కరు రూ.2వేలు చొప్పున మొత్తం రూ.10వేలు ఇస్తామని చెప్పారు. తర్వాత రైతులు హనుమంతు, రంగస్వామి కర్నూలులోని ఏసీబీ అధికారులను కలిసి విషయం చెప్పారు. ప్లాన్ ప్రకారం అధికారులు మంగళవారం సాయంత్రం 5:30 గంటల సమయంలో దాడి చేసి రూ. 10 వేలు లంచం తీసుకుంటున్న వీఆర్వో రామకృష్ణ, తలారి మల్లేష్‌ను పట్టుకున్నారు. వీఆర్వో రామకృష్ణ దగ్గర రూ.8,750, తలారి మల్లేష్ దగ్గర రూ.26,430 అదనంగా ఉన్నాయి. ఈ సొమ్మును కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. దాడిలో ఏసీబీ డీఎస్పీ వెంకటాద్రితో పాటు సీఐలు తేజేశ్వర రావు, కృష్ణారెడ్డి, వంశీ పాల్గొన్నారు.

సాంబవరంలో అగ్ని ప్రమాదం

- గ్యాస్ సిలిండర్ పేలి మూడు కొట్టాలు దగ్ధం
- దాదాపు రూ.5లక్షలు ఆస్తినష్టం





మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గోస్పాడు: గ్యాస్ సిలిండర్ పేలి మూడు కొట్టాలు దగ్ధమైన సంఘటన గోస్పాడు మండలం సాంబవరం గ్రామంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చిన్నమద్దిలేటి నివసిస్తున్న కొట్టంలో గ్యాస్ సిలిండర్ పేలి మంటలు వ్యాపించాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం జరగలేదు. ఈ ప్రమాదంలో పక్కనున్న ఆవుల మద్దిలేటి, ఆవుల మౌలాలమ్మకు చెందిన కొట్టాలకు కూడా మంటలు వ్యాపించి ఎగిసిపడ్డాయి. స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అగ్నిప్రమాదం జరిగే సమయంలో మూడు కుటుంబాలకు చెందిన వారు గుడిసెల్లో నుంచి బయటకు పరుగులు తీశారు. దీంతో ఎవరికి ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. కొట్టాలు ఒకదానికి ఒకటి పక్కపక్కనే ఉండటంతో అందులో తిండిగింజలు, బట్టలు, బంగారు వస్తువులు, వంట సామగ్రి వంటివి కాలిబూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో చిన్నమద్దిలేటికి రూ.3 లక్షలు, ఆవుల మద్దిలేటి, ఆవుల మౌలాలమ్మకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున మొత్తం రూ.5 లక్షల వరకు ఆస్తినష్టం సంభవించినట్లు తెలుస్తోంది. అగ్ని ప్రమాద బాధితులను ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పుట్లూరులో ఇరువర్గాల ఘర్షణ

- ఒకరికి గాయాలు
- బొలేరో వాహనం ధ్వంసం

కృష్ణగిరి: మండల పరిధిలోని పుట్లూరు గ్రామంలో మంగళవారం రాత్రి ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. పాతకక్షల నేపథ్యంలో జరిగిన ఈ గొడవలో గ్రామానికి చెందిన కురువ మహేష్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. అలాగే గ్రామ సమీపంలో మల్లయ్య అనే వ్యక్తికి సంబంధించిన బొలేరో వాహనాన్ని ధ్వంసం చేశారు. విషయం తెలిసిన వెంటనే కృష్ణగిరి ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి హుటాహుటిన గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. గాయపడిన మహేష్‌ను వెల్దుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ముందు జాగ్రత్తగా గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామని, జరిగిన సంఘటనపై పూర్తిస్థాయిలో విచారించి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

కరెంట్ ఉచ్చుకు చుక్కల దుప్పి బలి

- ఇద్దరు వేటగాళ్లు అరెస్ట్

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని చిన్న గుమ్మడాపురం గ్రామ పరిసరాల్లో వేటగాళ్ల కరెంట్ ఉచ్చుకు చుక్కల దుప్పి బలైంది. ఎఫ్ఆర్ఓ పట్టాభి తెలిపిన వివరాల మేరకు.. దుప్పిని వేటాడి చంపినట్లు సమాచారం మేరకు అటవీ అధికారులు ఎఫ్ఎస్ఓలు నాగేశ్వరరావు, పాములేటి తదితరులు చిన్న గుమ్మడాపురంలో కదిరి చిన్న పుల్లన్న, వరద సామేలు ఇళ్లలో తనిఖీ చేయగా రెండు కిలోల దుప్పి మాంసం లభించింది. ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా తమతో పాటు గ్రామానికి చెందిన చిన్న మూగెన్నతో కలసి కరెంట్ ఉచ్చు వేసి దుప్పిని వేటాడినట్లు వెలుగులోకి వచ్చింది. పరారీలో ఉన్న మూగెన్న కోసం గాలిస్తున్నట్లు ఎఫ్ఆర్ఓ పట్టాభి తెలిపారు. పట్టుబడిన ఇద్దరి నిందితులను కోర్టులో హాజరు పరుచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారు.



వన్య ప్రాణి మాంసంతో అటవీ అధికారులకు చిక్కిన నిందితులు

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించండి





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన, హాజరైన అధికారులు

కర్నూలు(సెంట్రల్): పోలింగ్ కేంద్రాల్లో ఫిబ్రవరి 5 నాటికి పెండింగ్‌లోని మౌలిక సదుపాయాల కల్పన పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్‌లోని సివిల్ పనులకు సంబంధించి టాయ్‌లెట్లు, ర్యాంపులు, వాకిళ్లు, కిటికీల నిర్మాణాలపై దృష్టి సారించాలన్నారు. అనంతరం శాఖల వారీగా పోలింగ్ కేంద్రాల్లో చేడపతున్న పనులపై ఆరా తీశారు. ఆదోని మునిసిపాలిటీకి సంబంధించి ఐదు పోలింగ్ కేంద్రాలకు టాయ్‌లెట్లను ఏర్పాటు చేసేందుకు అవకాశం లేదని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా మొబైల్ టాయ్‌లెట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. పంచాయతీరాజ్‌కు సంబంధించి పెండింగ్ పనులను ఫిబ్రవరి 3లోపు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. సమావేశంలో కార్యక్రమంలో డీఆర్ఓ మధుసూదన్‌రావు, ఎస్ఎస్ఏ పీఓ విజయజ్యోతి, పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యం, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, ఈడబ్ల్యూఐడీసీ ఎస్ఈ లక్ష్మీనారాయణ, ఎమ్మిగనూరు మునిసిపల్ కమిషనర్ గంగిరెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం పట్టివేత



మద్యం స్వాధీనం చేసుకుని రవాణాదారుడిని అరెస్టు చూపుతున్న సెబ్ పోలీసులు

కర్నూలు : స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో తనిఖీల్లో భారీగా తెలంగాణ మద్యం పట్టుబడింది. కర్నూలు డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ సీఐ నరసనాయుడు, సెబ్ సీఐ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో కర్నూలు శివారులోని ఉల్చాల క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం వాహన తనిఖీలు నిర్వహించారు. తెలంగాణ వైపు నుంచి మార్కాపురం వెళ్తున్న ఆటోను ఆపి తనిఖీ చేయగా, అందులో 120 తెలంగాణ మద్యం బాటిళ్లు బయటపడ్డాయి. ఆటోలో ఉన్న మార్కాపురం గ్రామానికి చెందిన బి.ప్రతాప్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా తెలంగాణ రాష్ట్రం శాంతి నగర్‌లో గల మద్యం షాపు నుంచి మద్యాన్ని తీసుకువెళ్తున్నట్లు తెలిపాడు. ఆటోతో పాటు మద్యాన్ని సీజ్ చేసి, అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. దాడుల్లో ఎస్ఐలు రెహానా బేగం, వీరస్వామి, సిబ్బంది షేక్షావలి, సుదర్శన్ రాజు, బషీర్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానంలో మహిళ ఆత్మహత్య

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని సజ్జలగుడ్డం రోడ్డులోని శ్మశాన వాటికలో వడ్డే అంపమ్మ (35) అనే వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కౌతాళం మండలం వల్లూరు గ్రామానికి చెందిన అంపమ్మ భర్త, పిల్లలను వదిలేసి అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తితో కలిసి కోసిగికి చేరుకొని కొన్నాళ్లు సహజీవనం చేశారు. ఆయన వదిలేయడంతో కోసిగిలోని సిద్దప్ప పాళెం వీధిలో వడ్డే రాముడుతో కలిసి ఉండేది. ఈ నెల 27వ తేదీన అతను అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. కోసిగి శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ప్రియుడు మృతితో మనస్తాపానికి గురైన ఆమె సోమవారం అర్ధ రాత్రి శ్మశాన వాటికకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు మంగళవారం ఏఎస్ఐ నాగరాజు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తల్లి అమరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అంబేద్కర్ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



డాక్టర్ ఐ.శ్రీదేవి, జిల్లా సమన్వయ అధికారి

కర్నూలు(అర్బన్): జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులాల్లో 2024–25 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, 5వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ ఐ.శ్రీదేవి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రవేశాలను రిజర్వేషన్ ప్రకారం భర్తీ చేస్తామన్నారు. విద్యార్థులు వెబ్‌సైట్ httpr://apbrafcet.apcfrr.in చిరునామాలో ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి 23వ తేదిలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర సమాచారం కోసం ఇదే వెబ్‌సైట్ లేదా సమీపంలోని గురుకులాల ప్రిన్సిపాళ్లు, తమ కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలన్నారు. 5వ తరగతి విద్యార్థులకు మార్చి 10న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఇంటర్మీడియట్ విద్యార్థులకు అదే రోజున మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు.

సీట్ల వివరాలు ..

గురుకులం	5వ తరగతి	ఇంటర్మీడియట్
చిన్నెదేవరపాడు, కర్నూలు (బాలికలు)	80	ఎంఈసీ 40, సీఈఈ 40
వెల్దుర్తి (బాలికలు)	80	ఎంపీసీ 40, బైపీసీ 40
కంబాలపాడు (బాలికలు)	80	ఎంపీసీ 40, బైపీసీ 40, హెచ్ఈసీ 40, సీఈసీ 40
పత్తికొండ (బాలికలు)	80	ఎంపీసీ 40, బైపీసీ 40
ఆరేకల్ (ఆదోని, బాలికలు)	80	ఎంపీసీ 40, బైపీసీ 40
సీ బెళగల్ (బాలురు)	80	ఎంఈసీ 40, హెచ్ఈసీ 40
చిన్నటేకూరు (బాలురు)	--	ఎంపీసీ 80, బైపీసీ 80
ఆలికెర (బాలురు)	80	ఎంఈసీ 40, హెచ్ఈసీ 40

పీఏసీఎస్‌లను మరింత అభివృద్ధి చేసుకోవాలి

- డీసీఎంఎస్ చైర్‌పర్సన్ సీహెచ్ శిరోమణి మద్దయ్య




శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న డీసీఎంఎస్ చైర్‌పర్సన్ శిరోమణి మద్దయ్య

కర్నూలు(అగ్రికల్చర్): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను పకడ్బందీగా నిర్వహిస్తూ... మరింత అభివృద్ధి చేసుకోవాలని జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్‌పర్సన్ సీహెచ్ శిరోమణి మద్దయ్య అన్నారు. మంగళవారం స్థానిక డీసీపీఎంఎస్‌లో జిల్లాలోని పీఏసీఎస్‌ల సీఈవోలకు ఇండియన్ కో–ఆపరేటివ్ మేనేజ్‌మెంట్ (ఐసీఎం) ద్వారా మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. శిక్షణ కార్యక్రమానికి 35 సంఘాల సీఈవోలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నిర్వహణపైనే సంఘాల అభివృద్ధి ఆధారపడి ఉంటుందని చెప్పారు. సంఘాల రికార్డులను పకడ్బందీగా నిర్వహించుకోవాలని, పనితీరుకు అవే ఆధారమవుతాయని తెలిపారు. పీఏసీఎస్‌లు లాభాల బాట పట్టడానికి ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడుతాయని తెలిపారు. ఐసీఎం ఫ్యాకల్టీ శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ... సంఘాలు అభివృద్ధికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఓ రామాంజనేయులు, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

హెబ్బటంలో పేలిన గ్యాస్ సిలిండర్లు

- గుడిసె, రూ. 3 లక్షల నగదు, 5 తులాల బంగారు దగ్ధం



పేలిన గ్యాస్ సిలెండర్లు ఇవే



హెబ్బటంలో పూర్తిగా కాలిపోయిన గుడిసె

హొళగుంద: మండల పరిధిలోని హెబ్బటం గ్రామంలో మంగళవారం ఉదయం ప్రమాదవశాత్తు వంట గ్యాస్ సిలిండర్లు పేలిపోయాయి. ఈ ఘటనలో బాధిత కుటుంబానికి రూ.15 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లింది. వివరాల్లోకి వెళితే... బోయ నల్లన్నయ్యగారి రాఘవేంద్ర గ్రామంలోని వెంకటగిరి కాలనీలో గుడిసె వేసుకొని నివాసం ఉంటున్నాడు. మంగళవారం ఉదయం భార్య లక్ష్మితో కలిసి పొలానికి వెళ్లాడు. గుడిసెలో ఉన్న తల్లి నర్సమ్మ టీ చేసుకునేందుకు గ్యాస్ స్టౌ వెలిగించి బయటకు వెళ్లింది. ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్లకు మంటలంటుకుని పేలిపోయాయి. ఈ ఘటనలో గుడిసెతో పాటు అందులోని తిండిగింజలు, బట్టలు, ఇతర సామగ్రితో పాటు బీరువాలో దాచుకున్న రూ.3 లక్షల నగదు, 5 తులాల బంగారు నగలు పూర్తిగ కాలి బూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న తహసీల్దారు హుసేన్‌సాహెబ్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు కోరారు.